గురువారం 10, ఏప్రిల్, 2025

కోరిలేషన్ ఆప్షన్ తో సమస్యను పరిష్కరించండి : రైతుల ఆవేదన

విశాలాంధ్ర-ఆనందపురం: గత ప్రభుత్వ హయాంలో రీ సర్వేలో జరిగిన కొన్ని పొరబాట్లు కొంతమంది రైతులకు , కొలతల్లో భూమి తక్కువ రావడం రీ సర్వే పద్ధతిలో రైతుల మరల అర్జీ పెట్టుకుంటే సర్వే చేసి వారికి క్లుప్తంగా వివరణ ఇచ్చేవారు. పూర్తిస్థాయిలో సర్వే అయిన భూములకు ల్యాండ్ పొజిషన్ నెంబర్లు అందించారు.అయితే భూమి కొలతలలో జరిగిన కొన్ని సర్వే నెంబర్లకు ఎల్పీ నెంబర్లకు, కొన్ని సాంకేతిక సమస్యల వలన ప్రధాన సమస్యలు తీరడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తలపెట్టిన రెవెన్యూ సదస్సులలో సమస్యల పరిష్కారానికి అర్జీలు పెట్టినప్పటికీ ,కోరిలేషన్ సమస్య ప్రధానంగా పరిష్కారం కాలేదని, విలేజ్ రెవెన్యూ అధికారి స్థాయి నుంచి పూర్తిస్థాయి సమగ్ర నివేదిక పై స్థాయి అధికారులకు అందించినప్పటికీ ఈ సమస్య పరిష్కారం కాలేదని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రీసర్వే లో జరిగిన స్వల్ప మార్పులను సరిచేసి కోరిలేషన్ లో ఉన్న మార్పులను సరిచేసి రైతుల సమస్యను పరిష్కరించి వారికి భూహక్కు పత్రాలు మంజూరు చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారంలో వ్యూహాత్మకంగా వ్యవహరించాలి

రెవెన్యూ వర్క్‌షాప్‌లో కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్: తాత్కాలిక, దీర్ఘకాలిక రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అధికారులు, సిబ్బంది వ్యూహాత్మకంగా వ్యవహరించాలని, పారదర్శకత లోపించకుండా ప్రక్రియలను వేగవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్ మీటింగు హాలులో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి రెవెన్యూ వర్క్ షాప్ లో ఆయన వివిధ అంశాలపై మాట్లాడారు. రెవెన్యూ పరమైన అన్ని అంశాలపై, నిబంధనలపై, ప్రభుత్వం జారీ చేసే జీవోలపై పైస్థాయి నుంచి కింది స్థాయి వరకు అందరూ అవగాహన కలిగి ఉండాలని, సవరణలు, మార్పులపై అప్ డేట్ అవుతూ ఉండాలని సూచించారు. ప్రజల అవసరాలు, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సరళతర విధానంలో ప్రక్రియలను నిర్వహించాలని హితవు పలికారు. వర్క్ షాప్ లో భాగంగా ఆక్రమణల క్రమబద్ధీకరణ, భూముల బదలాయింపు, సర్వే, మ్యుటేషన్, రిజిస్ట్రేషన్, గిఫ్ట్ డీడ్, కన్వెయన్స్ డీడ్, 22ఏ జాబితా, ప్రభుత్వ భూముల ఆక్రమణ - చర్యలు, 27, 30, 296, 388 వంటి జీవోల అమల్లో అనుసరించాల్సిన విధానాలపై రెవెన్యూ సిబ్బందికి కలెక్టర్ దిశానిర్దేశం చేశారు.ప్రభుత్వ భూమి ఆక్రమణ క్రమబద్ధీకరణ పథకం, 2025 ద్వారా వీలైనంత మందికి లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. 15.10.2019 కంటే ముందు ఆక్రమించుకున్న వారికి ప్రభుత్వం కల్పించిన వెసులుబాటు గురించి తెలపాలని, పూర్తి సహకారం అందించాలని సూచించారు. నగరంలోని ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ గురించి ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.30(296, 388) ఆధారంగా ప్రక్రియలను త్వరితగతిన చేపట్టాలని రెవెన్యూ సిబ్బందికి చెప్పారు. ఎన్.ఐ.సి. సహాయంతో డేటా బేస్ మేనేజ్మెంట్ నిర్వహించి రిజిస్ట్రేషన్ ప్రక్రియలను వేగవంతంగా నిర్వహించాలని, శ్లాట్ విధానం అమలు చేయాలని సూచించారు. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న వివిధ సమస్యలను తహశీల్దార్లు, డీటీలు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇనాం భూములు, దేవాదాయ శాఖ పరిధిలోని భూముల విషయంలో వివరాలు సరిపోలటం లేదని, జీవో నెం.30, 296, 388 అమల్లో ఎదురవుతున్న సమస్యలను వివరించారు. జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్ పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాలకృష్ణ, భీమిలి, విశాఖపట్టణం ఆర్డీవోలు సంగీత్ మాధుర్, పి. శ్రీలేఖ, సర్వే శాఖ ఏడీ సూర్యారావు, కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు, ఎన్.ఐ.సి. అధికారి పాషా, ల్యాండ్ సెక్షన్ అధికారులు, అన్ని మండలాల తహశీల్దార్లు, డీటీలు తదితరులు పాల్గొన్నారు. ..

ప్రజల రుణం తీర్చుకునే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు

విశాలాంధ్ర -పెందుర్తి: గత ఎన్నికల్లో కని విని ఎరుగని మెజారిటీతో గెలిపించిన ప్రజల రుణం తీర్చుకునే విధంగా అభివృద్ధి కార్యక్ర మాలు చేపడుతున్నట్లు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు తెలిపారు. జీవీఎంసీ 97 వ వార్డులో బుధవారం ఉదయం కోటి 67 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ సేనాపతి వసంత శంకర్రావుతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. సుజాతనగర్ గిరి ప్రసాద్ నగర్-1 లో 33.57 లక్షలతో సీసీ రోడ్లు, చిన్నముసిడివాడ భాస్కర్ రెడ్డి లేఔట్ లో 49.84 లక్షలతో తారు రోడ్డు, అంబేద్కర్ నగర్లో 19.96 లక్షలతో సీసీ రోడ్లు, కాలువలు, ద్రోణంరాజు నగర్ లో 23.50 లక్షలతో తారు రోడ్డు, సాయి నగర్ కాలనీలో 20 లక్షలతో సీసీ రోడ్లు, కాలువలు, శ్రమశక్తి నగర్ గాయత్రీ దేవి టెంపుల్ వద్ద 19.95 లక్షలతో సీసీ కాలువల నిర్మాణానికి ఎమ్మెల్యే కార్పొరేటర్ శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్న గత ఎనిమిది నెలల కాలంలోనే 70 కోట్ల నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో ప్రభుత్వం ఆర్థికంగా భారీగా పుంజుకుంటుందని ఆ తర్వాత మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఎన్నికల్లో ఆశీర్వదించిన ప్రజలు రుణం తీర్చుకునే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హయాంలో పాలన సాగుతోందని ఎమ్మెల్యే పంచకర్ల స్పష్టం చేశారు. కార్యక్రమంలో జోన్ 8 కమిషనర్ హైమావతి, డి ఈ ప్రవీణ్ , ఏ ఈ పార్వతి, 97 వార్డ్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సేనాపతి శంకర్రావు, మాజీ సర్పంచ్ శైలజ, అవగడ్డ అప్పలనాయుడు, అయితే సింహాచలం, ఆర్ఎస్ నాయుడు, తైనాల మహేష్, పిల్లా జగన్మోహన్, డిబిఎల్ నాయుడు, రాపర్తి కిషోర్,దారపు వెంకన్న, దూది వెంకట్, దుంబారీ ప్రభాకర్, భక్తిమాల, ముక్క సంతోష్ ,ముమ్మన గురువులు తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్ లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ఓపీ సేవలపై, సిబ్బంది సహకారంపై ఆరా...

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ కింగ్ జార్జి ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం ఉదయం తన కార్యాలయానికి వచ్చే క్రమంలో ఆసుపత్రిని సందర్శించి అక్కడ ఓపీ కౌంటర్ల ద్వారా అందుతున్న సేవలను పరిశీలించారు. హెల్ప్ డెస్కు పనితీరు, కౌంటర్ల వద్ద సదుపాయాల స్థితిగతులను గమనించారు. అభ యాప్ ద్వారా ఓపీ టికెట్ తీసుకునే విధానం, రోగులకు వైద్యులు, సిబ్బంది నుంచి అందుతున్న సహకారంపై ఆరా తీశారు. వైద్య సేవల నిమిత్తం ఆసుపత్రికి వచ్చిన పలువురు రోగులతో కలెక్టర్ ఈ సందర్భంగా మాట్లాడారు. వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఓపీ తీసుకునేందుకు ఎంత సేపు నిరీక్షిస్తున్నారు.. హెల్ప్ డెస్కులో ఉన్నవారు పూర్తి సహకారం అందిస్తున్నారా లేదా అనే అంశాలపై రోగులతో మాట్లాడారు. సిబ్బంది వ్యవహార శైలి, సదుపాయాలు, ఇతర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. తనిఖీ సమయంలో ఆయన వెంట కేజీహెచ్ సూపరింటెండెంట్ డా. కె. శివానంద, ఆర్.ఎం.వో. డా. మెహర్ కుమార్ ఉన్నారు. రోగులకు అక్కడ కల్పిస్తున్న సౌకర్యాలపై కలెక్టర్ కు వివరించారు.

పోలీసులపై నోటిదురుసుకు క్షమాపణ చెప్పాలి

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు డిమాండ్

విశాలాంధ్ర-భీమిలి: పోలీసులు తన ప్రాణాలను సైతం లెక్కచేయక, కుటుంబానికి కూడా కావలసినంత సమయం కేటాయించక, ప్రజల కోసం, పాలకుల రక్షణ కోసం అహర్నిశలు రాత్రింబవళ్ళు కంటికి పాపలా కాపలాకాసే రక్షక కవచాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు.బుధవారం భీమిలి టీడీపీ కార్యాలయంలో గంటా నూకరాజు మీడియాతో మాట్లాడారు. ప్రజల సాక్షిగా, పోలీసుల సాక్షిగా మాజీ ముఖ్యమంత్రి, వైసిపీ అధ్యక్షుడు జగన్ రెడ్డి మాట్లాడిన తీరు రాష్ట్రంలో ఉండే ప్రతీ ఒక్కరిని ఆశ్చర్యానికి గురిచేసిందని అన్నారు. పోలీసుల గుడ్డలు ఊడదీసి కొడతామని, అధికారంలోకి వస్తే మొత్తం పోలీసులను తొలగిస్తామని హెచ్చరించడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. ఈరోజు రాష్ట్రంలో పోలీసులు లేకపోతే ఏ రాజకీయ నాయకుడైనా ఒక్క అడుగు ముందుకు వేయగలడా.. అని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల రక్షణ కోసం కష్టాలను, నష్టాలను భరిస్తూ, కుటుంబాన్ని సైతం లెక్కచేయక పని చేస్తున్నారని అన్నారు. అలాంటి రక్షక భటులపై నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదని అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పర్యటనకు వెళ్లిన మీకు సాక్ష్యాత్ 1100 మంది పోలీసులతో రక్షణ కల్పించామని జిల్లా ఎస్పీ చెప్పిన మాట మరిచారని అన్నారు. పోలీసుల గుడ్డలు ఊడదీస్తామని, వారిని తొలగిస్తామని చెప్పిన మీకు అక్కడ పోలీసులు లేకపోతే ఒక్క అడుగు ముందుకు వేయగలరా..? అని అన్నారు. కూటమి ప్రభుత్వంలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని, పోలీసులు వారి స్థాయికి మించి విధులు నిర్వర్తిస్తున్నారని అన్నారు. వారిమీద ప్రభుత్వం మీద నిందలు వేయొద్దని హెచ్చరించారు. రాష్ట్రంలో ఐదేళ్ల వైకాపా నీచ పాలనలో అన్ని వ్యవస్థలను భ్రష్టుపట్టించారని అన్నారు వాటిని గాడిలో పెట్టి ప్రజలకు సుపరిపాలన అందించే పనిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నారని అన్నారు. ప్రజలకు పోలీసుల మీద ఉండే నమ్మకానికి, గౌరవానికి ఎటువంటి భంగం కలిగించే వ్యాఖ్యలు చేయొద్దని, ఎందుకు ఎన్నికల్లో ప్రజలు ఇంత తీవ్రమైన గుణపాఠం చెప్పారో స్టడీ చేసుకోవాలని గంటా నూకరాజు సలహా ఇచ్చారు.

అంతా జగన్నాటకం...!

హెలికాప్టర్ వివాదంపై హోంమంత్రి ఫైర్

విశాలాంధ్ర-విశాఖ సిటీ: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై హెూంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బుధవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి డ్రామాలాడుతున్నారని దుయ్యబట్టారు. ప్రజలు 11 సీట్లతో తీర్పిచ్చినా సిగ్గు రాలేదా అంటూ ఫైర్ అయ్యారు. గతంలో ఐపీసీ కన్నా వైసీపీ కోడ్ అమలైందన్నారు. రాప్తాడు నియోజకవర్గానికి వెళ్తున్న జగన్మోహన్ రెడ్డికి అక్కడి పరిస్థితుల దృష్ట్యా 1100 మంది పోలీసులతో రక్షణ ఇచ్చామన్నారు. 250 మంది పోలీసులు హెలిపాడ్ వద్ద ఉన్నారని తెలిపారు. వీఐపీని తీసుకువెళ్లడానికి వీలుకాని హెలికాప్టర్ 15 నిమిషాల్లో ఎలా ఎగిరి వెళ్లిందని ప్రశ్నించారు. ప్లాన్ ప్రకారం ఇదంతా చేశారని అనిపిస్తోందని అనుమానం వ్యక్తం చేశారు. వీటన్నింటి పైన విచారణ కొనసాగుతుందని తెలిపారు. మాట్లాడితే లా అండ్ ఆర్డర్ లేదు లా అండ్ ఆర్డర్ లేదు అంటున్నారని, గతంలో చంద్రబాబు బయటికి రాకుండా అడ్డుకున్నారని, ఎయిర్‌పోర్టుల్లో గుండాలను పెట్టి అడ్డుకున్నారని గుర్తుచేశారు. పార్టీ కార్యాలయాల మీద దాడులు చేయించారన్నారు. ఇలాంటివన్నీ చేసింది జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. కస్టోడియల్ టార్చర్ అనేది జగన్మోహన్ రెడ్డి సంస్కృతి అని తమది కాదని స్పష్టం చేశారు. గతంలో జగన్మోహన్ రెడ్డిని ప్రశ్నించినందుకు తమ మీద అనేక మంది మీద కేసులుపెట్టారన్నారు. పులివెందుల ఎమ్మెల్యేగా వన్ ప్లస్ వన్ సెక్యూరిటీ ఇవ్వాలని, కానీ ఒక మాజీ ముఖ్యమంత్రిగా జగన్‌కు జెడ్ ప్లస్ సెక్యూరిటీ ఇస్తున్నామని చెప్పారు. ఇవ్వాల్సిన భద్రత కన్నా ఎక్కువ భద్రత ఇస్తున్నామని వెల్లడించారు. పోలీసుల బట్టలు ఊడదీస్తామంటూ మాట్లాడే పద్ధతి సరియైనదేనా అని ప్రశ్నించారు. వైసీపీ హయాంలో 2526 హత్యలు జరిగాయని, అక్కడికి వెళ్తామన్నా తాము ప్రొటెక్షన్ ఇస్తామని తెలిపారు. ఎవరైనా పోలీస్ డిపార్ట్‌మెంట్ మీద శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా మాట్లాడినా, పోస్టులు పెట్టినా తగిన విధంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. భద్రతా వైఫల్యం ఆరోపణలపై హెూం మంత్రిగా తాను చర్చకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ స్వయంగా మీటింగ్ పెట్టి పార్టీ నిర్ణయాన్ని, ప్రభుత్వం నిర్ణయాన్ని గౌరవించాలని, ఎవరు బయటకు రావద్దని పిలుపునిచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా హోంమంత్రి అనిత గుర్తు చేశారు.

బియ్యం అక్రమ రవాణా : ఒకని అరెస్ట్

విశాలాంధ్ర-గాజువాక: అక్రమంగా రవాణా చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లై ఆర్ఐ పద్మావతి బుధవారం పట్టుకున్నారు. ఈ క్రమంలో ఆర్ఐ పద్మావతిపై నిందుతుడు దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కల్పించినట్లు ఆరోపణలు నెపథ్యం లో బియ్యం వ్యాపారి పచ్చిగొల్ల కృష్ణపై పోలీసులు కేసు నమోదు చేసారు. గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడ్ని రిమాండ్ కు తరలించారు.

నేడు మహావీర్ జయంతి సందర్భంగా మాంసం దుకాణాలకు సెలవు

జీవీఎంసీ నగర పశు నియంత్రణాధికారి డా. కిషోర్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ఏప్రిల్ 10 గురువారం మహావీర్ జయంతి సందర్భంగా మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలోగల జంతువధ, మాంస విక్రయాలను నిషేధం ఉన్నందున జంతువధశాలలు, మటన్, చికెన్, చేపలు, మొదలైన మాంసాహారపు దుకాణాలకు సెలవు ప్రకటించడమైనదని జీవీఎంసీ నగర పశు నియంత్రణాధికారి డాక్టర్ ఎన్.కిషోర్ బుధవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. జిల్లా కలెక్టర్ మరియు జీవీఎంసీ ఇన్ చార్జ్ కమిషనర్ డాక్టర్ ఎమ్.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు ఏప్రిల్ 10వ తేదీన (గురువారం) మహావీర్ జయంతి సందర్భంగా జివిఎంసి పరిధిలో మటన్, చికెన్, చేపలు మొదలైన మాంసాహార అమ్మకాలు నిషేధించినందున శానిటరీ ఇన్స్పెక్టర్లు, శానిటరీ కార్యదర్శులు, శానిటరీ మేస్త్రీలు వారి సచివాలయం పరిధిలో గల మాంసం, చేపలు విక్రయశాలలను మూసివేయవలసినదిగా ఆదేశించామని తెలిపారు. కావున బహిరంగంగా మాంసం విక్రయదారులు మాంసాన్ని విక్రయించరాదని అందుకు విరుద్ధంగా అతిక్రమంచి దుకాణాలు తెరిచినా, మాంసాన్ని అమ్మిన యెడల చట్టపరమైన చర్యలు తీసుకోవడం తో పాటు అపరాధ రుసుము వసూలు చేయడం జరుగుతుందని సిటీ వెటర్నరీ అధికారి హెచ్చరించారు.

నిజరూప దర్శనం ఏర్పాట్ల పై కమిషనర్ సమావేశం



విశాలాంధ్ర -సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారి చందనోత్సవం (నిజరూప దర్శనం) ఏర్పాట్ల పై రాష్ట్ర దేవదాయ శాఖ ఇంచార్జ్ కమిషనర్ కె రామచంద్రమోహన్ జిల్లా దేవదాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఇంచార్జ్ కార్యనిర్వాహణాధికారి కె సుబ్బారావు, ఆర్.జె.సి సుజాత, డిప్యూటి ఈఓ రాధ, ఏసి అన్నపూర్ణ, ఈఈ శ్రీనివాసరాజు, రాంబాబు, సహయ కార్యనిర్వహణాధికారులు ఆనంద్ కుమార్, రాజేంద్ర కుమార్ తదితర అధికారులతో క్యూలైన్‌లు, మంత్రులు, కూడా ఎమ్మెల్యేలు, న్యాయ మూర్తులు, తదితర ప్రముఖులకు, టిక్కెట్లు కలిగిన, సామాన్య భక్తులకు స్వామి వారి దర్శనం నిజరూప దర్శనం సమయం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా చూడాలని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చూపించారు. పిదప ప్రసాద్ స్కీమ్ భవనంలో భక్తుల క్యూ లైన్ ఎలా వేస్తారో ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

నూకాలమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ గా పోతిన అప్పలరాజు

విశాలాంధ్ర-పీఎంపాలెం: కె.నగరప్పాలెం, సోమన్నపాలెం,రెడ్డిలపాలెం, గొల్లలపాలెం గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ నూకాలమ్మ తల్లి ఆలయ కమిటీ నూతన ఛైర్మన్ గా ప్రమాణస్వీకారం చేసిన పోతిన అప్పలరాజు నియమితులు కాగా మెంబర్లుగా పోతిన వెంకటేష్ (వెంకీ)నాగోతి అచ్చారావు రెడ్డిలపాలెం ఎరుసు అప్పలకొండ పాల నాయుడు సోమన్నపాలెం నారు యల్లాజి నరవ బసవయ్య గొల్లలపాలెం కోడిబోయిన వరహాలు దేవర వెంకట్రావు నియమితులు అయ్యారని ఆలయ అధికారులు తెలిపారు. నూతన కార్యవర్గం ఈరోజు నూకాలమ్మ గుడిలో ప్రమాణస్వీకారం చేశారు. నూతన కార్యవర్గం మాట్లాడుతూ ఆలయ అభివృధికి తాము అంత కలిసికట్టుగా కృషిచేస్తామని తెలిపారు.

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి కామ్రేడ్ సీఆర్

విశాలాంధ్ర-పీఎం పాలెం: సిపిఐ పార్టీ పూర్వ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతి సందర్భంగా బుధ వారం మధురవాడ సిపిఐ కార్యాలయంలో మధురవాడ ఏరియా సిపిఐ కార్యదర్శి వి సత్యనారాయణ ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీఆర్ స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారు కార్మికుల పక్కన కర్షకులు పక్షాన ఎన్నో పోరాటాలు చేసిన మహనీయులు ఆయన మరణించిన 31 సంవత్సరాలు అయినా ఎప్పటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఆయన చేసిన పోరాటాలు అటువంటి మహనీయులు ఆశ సాధనకై పోరాడు తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు. ఎం అప్పారావు. మహేష్, రామకృష్ణ. షేక్ తానీస. రాంబాబు. రమణ తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు



విశాలాంధ్ర-పెడగంట్యాడ : పెద ,బడుగు , బలహీన వర్గాల హక్కుల కోసమే కాకుండా రైతాంగ పోరాటానికి అండగా ఉండి ఎన్నో పోరాటాలు చేసిన యోధుడు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు అని ,ఆయన ఆశయ సాధనకు మన మంతా కృషి చేయాలని గాజువాక నియోజక వర్గ సీపీఐ కార్యదర్శి కసి రెడ్డి సత్యనారాయణ పిలుపు నిచ్చారు .పెద గంట్యాడ పోతిన సన్యాసి రావుభవన్ లో బుధవారం చంద్ర రాజేశ్వరరావు 31 వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. తొలుత సిపిఐ నాయకులు చంద్ర రాజేశ్వరరావు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కసి రెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ సిపిఐ పూర్వ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు బడుగు , బలహీన వర్గాల ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేశారని అన్నారు . భూమి లేని పేదల కోసం పోరాటాలు చేసి భూములను పంపిణీ చేసిన యోధుడు చంద్ర రాజేశ్వరరావు అని అన్నారు. పెత్తందార్లు కు వ్యతి రేకంగా పోరాడి పేద ప్రజలకు అండగా నిలిచారని కొని యాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు జి. ఆనంద్ , కె. అచ్యుత రావు , పల్లెటి పోలయ్య , పి. దుర్గా రావు , కె. పోత య్యా, సోమేష్ , మాధవ రావు , విష్ణు మూర్తి, అప్పారావు , మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కె. వనజాక్షి ,పిల్లా పద్మ పాల్గొన్నారు.

రాష్ట్రం లో ప్రముఖ దేవాలయాలన్నీ గ్రీనరీ కోసం కసరత్తు : దేవదాయ శాఖ కమిషనర్



విశాలాంధ్ర-సింహాచలం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రముఖ ఆలయాలన్నీ తిరుమల మాదిరిగా ఎటు చూసినా గ్రీనరి కనిపించాలని దేవాదాయ శాఖ ఇంచార్జ్ కమిషనర్ కె రామచంద్రమోహన్ తెలిపారు. అందువలన ఆక్సిజన్ శాతం పెరిగి భక్తుల, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ఆలోచన అని, కాంక్రీట్ ఉన్న ప్రాంతాలన్నీ గ్రీనరి గాను, గ్రీనరి ఉన్న ప్రాంతాలన్నీ కాంక్రీట్ కాకుండా కాపాడాలని ఓ బృహత్తర ప్రణాళిక ప్రభుత్వం తయారు చేస్తుందని అన్నారు. వీటి అధ్యయనం కోసం మధ్య ప్రదేశ్ లో గ్రీనరీ ప్రాంతాలను సందర్శిస్తామని పేర్కొన్నారు. రానున్న రెండు నెలల్లో ఈ కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు తెలిపారు.

సీఆర్‌కు సీపీఐ ఘన నివాళి



విశాలాంధ్ర-మల్కాపురం: సిపిఐ పూర్వ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు(సీఆర్) 31వ వర్ధంతి సందర్భంగా మల్కాపురం గ్రామ మండలి లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కాండ్రేగుల సత్యాంజనేయ, గుడాల రాంబాబు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సత్యాంజనేయ మాట్లాడుతూ కామ్రేడ్ సీఆర్ చేసిన సేవలు మరువలేనివని ఆశయ సాధనకు అంతా కృషిచేయాలని కోరారు. పేద బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశలూ శ్రమించారని, ఆయన సొంత భూములను పేద ప్రజలకు పంచిన మహానుభావుడు కామ్రేడ్ రాజేశ్వరరావు అని కొనియాడారు. ఈ వర్ధంతి సమావేశంలో పాల్గొన్న నాయకులు సీనియర్ కామ్రేడ్ నూనెల సూరిబాబు, జిల్లా సమితి సభ్యులు గండి అప్పారావు, వై కనకేశ్వరరావు, చంద్రశేఖర్, సత్తిబాబు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు

వంట గ్యాస్ ధరలు తగ్గించాలని సిపిఐ నిరసన



విశాలాంధ్ర-పీఎం పాలెం : ప్రజలపై కేంద్ర ప్రభుత్వం భారాల మోపి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని, పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని కోరు తూ మధురవాడ సిపిఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్‌పై రూ.50లు పెంచింది. సామాన్య, మధ్యతరగతి ప్రజలు పై ధరలు పెంచి భారం మోపద్దని సిపిఐ డిమాండ్ చేస్తుందని, కేంద్రంలో నరేంద్ర మోడీ జాతీయ బ్యాంకుల్లో రుణాలు పొందిన వారికి కేంద్ర ప్రభుత్వం వడ్డీలు క్యాన్సిల్ చేస్తుందన్నారు. సామాన్యులు రోజువారి కూలీలపై భారం మోతేలా నిత్యవసర వస్తువు ధరలు పెట్రోల్, డీజిల్ వంటకి ధరలు ఆకాశాన్ని అంటే లా పెంచుకు పోతున్నారని పెంచిన నిత్యవసరం తగ్గించాలని సిపిఐ మహిళా సంఘం డిమాండ్ చేస్తుం దన్నారు. కార్యక్రమంలో సిపిఐ ఏరియా కార్యదర్శి వి.సత్యనారాయణ, మహిళా సంఘం నాయకురాలు ఎంఏ బేగం, సిపిఐ సభ్యురాలు వి లక్ష్మి, రాము, తిరుపతిరావు, షేక్, తనిన, రామకృష్ణ పాల్గొన్నారు.

గ్యాస్ బండ రూ.50లు పెంచడం దుర్మార్గం

విశాలాంధ్ర-మల్కాపురం: పెంచిన గ్యాస్ ధరలు రద్దు చేయాలని సిపిఐ డిమాండ్ చేస్తూ బుధవారం పారిశ్రామిక ప్రాంతంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ పశ్చిమ నియోజక వర్గ కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయ, గుడాల రాంబాబు పాల్గొని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు అయ్యిందని, ఇప్పటికే పెరిగిన నిత్యవసర వస్తువులతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతుంటే శ్రీరామనవమి కానుకగా గ్యాస్ బండ ధర రూ.50లు పెంచడం దుర్మార్గమని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వాన్ని పేదబలహీన వర్గాలపై భారం మోపి, ప్రజా ప్రభుత్వాలని గొప్పలు చెప్పుకోవడం తప్ప పేద, మధ్యతరగతి వారికి ఒరిగిందేమీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు పెంచిన గ్యాస్ ధరలను నియంత్రించలేకపోయిన సీపీఐ పార్టీ తరఫున అందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నూనెల సూరిబాబు, కనకరాజు, గండ అప్పారావు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరలపెంపుపై పెందుర్తిలో నిరసన ప్రదర్శన



విశాలాంధ్ర-పెందుర్తి: ఎన్నికల్లో కల్లబొల్లి కబుర్లు చెప్పిన ఎన్డీఏ పాలకులు అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గ్యాస్ ధరల పెంపుదలను నిరసిస్తూ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిపిఐ శ్రేణులు పెందుర్తిలో భారీ ఆందోళన కార్యక్రమం చేపట్టారు. నాలుగు రోడ్ల కూడలిలో రాస్తారోకో నిర్వహించి వాహనాలను అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను విచ్చలవిడిగా తమకు అనుకూలమైన కార్పొరేట్లకు కట్టబెట్టి అడ్డగోలుగా దోచుకుంటున్నారన్నారు. ప్రశ్నించే వారిపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్డీఏ పాలకులు తీరు మార్చుకోకపోతే భవిష్యత్తులో ప్రజల నుండి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి శాఖ కార్యదర్శి ఎన్. అసిరి నాయుడు, బర్దన్ నగర్ కార్యదర్శి ఏ. అన్నపూర్ణ, పార్టీ నాయకులు ఎన్. అరుణ, శ్రీరామ్, జ్యోతి పెద్ద సంఖ్యలో సిపిఐ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

లూలూ ను నగరంలో వేరే చోటికి తరలించండి

పర్యాటక శాఖ మంత్రికి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పూర్వ ఛైర్మన్ ప్రొఫెసర్ కె యస్.చలం లేఖ



విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్న లూలూ మాల్ ను నగరంలో వేరే ప్రాంతానికి మార్చాలని కోరుతూ ముఖ్యమంత్రికి,పర్యాటక శాఖ మంత్రికి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పూర్వ ఛైర్మన్ ప్రొఫెసర్ కె యస్.చలం లేఖ రాశారు. ఆర్ కె బీచ్ వద్ద గల ఏపీఐఐసీ స్థలంలో గతం లో వద్దనుకున్న భూమిలో మళ్ళీ రూ" 1500 కోట్ల తో లులూ కంపెనీ ద్వారా మాల్ కనవెన్షన్ సెంటర్ ఏర్పాటు చేస్తామని టూరిజం వారు చెప్పటం విని ఆశ్చర్యానికి గురి అయ్యామన్నారు. దీని ద్వారా ఉద్యోగాలు వస్తాయని, విశాఖ అభివృద్ధి జరుగుతుందని మంత్రి అన్నట్లు వచ్చిన వార్త ఉత్తరాంధ్ర ప్రజలకు విశాఖ వాసులకు అశని పాతంగా వుంది. నిజానికి గతం లో ప్రజా ఉద్యమం ద్వారా యిది వద్దునుకున్నారు. గత ప్రభుత్వం మార్చింది. వద్దు అనుకోవటానికి కారణం- విశాఖ లోని పేద, మధ్య తరగతి ప్రజలకు ఉన్న ఒకే ఒక్క విశ్రాంతి, వినోద కాలక్షేప ప్రదేశం అది నగరం లో వున్న వన్నీ వ్యాపార మయమయం అయిపోయావి. ముఖ్యంగా బీచ్ లో యిప్పటికే ఆదివారం పూట అడుగు తీసి అడుగు వేయలేని పరిస్తితి వుంది. ట్రాఫిక్ గొడవలు గందరగోళం గా వుంటుంది. అటువంటి ప్రదేశం లో రోజు రెండు వేలమంది కార్లు, మంది మార్బలం తో అక్కడ వ్యాపార కార్య కాలపాలు నిర్వహిస్తే సామాన్యుడికి దిక్కెదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. యిప్పటికే అక్కడ వున్న స్థానిక నివాసాలు ఉండలేక వేరే చోటుకు పోదాం అనుకుంటున్నారు. అప్పుడు యిది రియల్ ఎస్టేట్ అభివృద్ధికి కూడా పనికి రాదు . యిది సిఆర్జెడ్ రేగులేషన్ లో 500 మీ లోపు వుంది. భవిష్యత్ లో గత 0 లో లాగే వ్యాజ్యాలకు, వివాదాలకు దారి తీయ వచ్చని తెలిపారు. విశాఖ వాసులు భావోద్రేకం గలవారు. ఈ ప్రాంతం వారికి వున్న ఒకే దిక్కు. అందుకే దానిపట్ల భక్తి మక్కువ ఎక్కువ. వారి భావాలకు దెబ్బ తగిలితే నిశ్శబ్దం గా తమ తీర్పు యిస్తారు. అందుచేత మీ యువ నాయకత్వానికి పెట్టుబడి పెట్టాలనుకునే ఉత్సాహ వంతులకు మీరు హితోపదేశం చేసి లులు ప్రాజెక్ట్ ను ఆర్ కె బీచ్ కాకుండా వేరే ప్రాంతానికి మళ్లించమని హితవు పలకండి. భవిష్యత్ లో మధురవాడ ఉత్తర దిక్కు వృద్ధి చెందెలా వివిఎంఆర్డిఏ వారి సహకారంతో వేరే చోట కు తరలించమని కోరుతున్నాము. గతం లో ఈ ప్రాజెక్టు కు ప్రత్యామ్నాయం గా గత ప్రభుత్వం చూపిన అంశాలు పరిగణ లోకి తీసుకుని విశాఖ వాసులకు మేలు చేయమని మనవి చేస్తున్నామని పేర్కొన్నారు.

చిత్ర కళా పరిశోధనకు చిరునామా చలపతిరావు

విశాలాంధ్ర-మల్కాపురం: అరవైనాలుగు కళలలో అత్యంత ప్రముఖమైన చిత్రకళకు, దాని పరిశోధనకు చిరునామా సుంకర చలపతిరావు అని జిల్లా పౌర హక్కుల సంఘం అధ్యక్షులు టి.శ్రీ రామ్మూర్తి అన్నారు. సుంకర చలపతిరావును రాష్ట్ర ప్రభుత్వం లికళా రత్నలి పురస్కారంతో సత్కరించిన సందర్భంగా స్థానిక మల్కాపురంలోని శాఖీయ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ- చలపతిరావు రచయిత, పరిశోధకుడు, జర్నలిస్టు, సామాజిక కార్యకర్త మరియు విమర్శకుడు అని ఆయన అన్నారు. సమావేశంలో గౌరవ అతిథిగా పాల్గొన్న ప్రజా వైద్యులు డాక్టర్ పి.హేమలత మాట్లాడుతూ- చలపతిరావుకు అద్భుతమైన పరిశీలన శక్తి, సృజనాత్మకత, స్నేహభావం, సేవ భావం ఉన్నాయని కొనియాడారు. సమావేశానికి అధ్యక్షత వహించిన గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్ మాట్లాడుతూ- గాజువాక, సింధియా మరియు మల్కాపురం గ్రంథాలయాలకు చలపతిరావు చేసిన సేవలు అమూల్యమైనవని, ఆయనకు పురస్కారం లభించడం ఎంతో ఆనందించదగ్గ విషయమని అన్నారు. సమావేశంలో జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు ప్రకాశరావు, చిత్రకారులు ద్వారపూడి శ్రీనివాస మనోహర్ , శివ , మహేష్ మరియు స్థానిక పాఠకులు ప్రసంగించారు. అనంతరం చలపతిరావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సుంకరి చలపతిరావు మాట్లాడుతూ- రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే అత్యున్నత పురస్కారం కళా రత్న అని, ఇది తనకు లభించడం ఆనందించదగ్గ విషయమని అన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పక్షోత్సవాలు !

విశాలాంధ్ర-పెందుర్తి: పోషన్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 96 వార్డు నల్లక్వారీ 1,2 అంగన్వాడి కేంద్రాల్లో, సెక్టార్ సూపర్వైజర్ వి .వి .గీతాలక్ష్మీ ఆధ్వర్యంలో బుధవారం పౌష్టికాహార పక్షోత్సవాలు జరిగాయి. రాంపురం ఎస్సీ అంగన్వాడీ సెంటర్లో గర్భవతులకు బాలింతలకు మొదట 100 రోజులు సంరక్షణ , ఆహారంలో వైవిధ్యము , కేవలం తల్లిపాలపై దృష్టిని సారించడం విషయాలు పై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏప్రిల్ 8 నుండి 22 వరకు ఈ కార్యక్రమాలు అంగన్వాడీ కేంద్రాలలో కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు ఎం.వరలక్ష్మి, భవానీ,కె.సునీత ,భాగ్య సమత, లక్ష్మి , నాగమణి గర్భతులు ,బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

లాడ్జిల్లో ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర-విశాఖ క్రైమ్: ప్రభుత్వ నిబంధనలు పాటించని హోటళ్లు, లాడ్జీలు, మెన్ హాస్టళ్లపై పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అగ్నిమాపక అనుమతులు, జీఎస్టీ పత్రాలు, ట్రేడ్ లైసెన్సులు, ఆహార భద్రతా ధృవపత్రాలు లేని హెూటళ్లను గుర్తించారు. అలాగే, సందర్శకుల రికార్డులు నిర్వహించని, లగేజ్ స్కానర్లు, సీసీటీవీలు లేని హెూటళ్లను కూడా గుర్తించారు. ఈ తనిఖీలలో గుర్తించిన అంశాలు: 13 హోటళ్లు & లాడ్జీలు అగ్నిమాపక ఎన్‌ఓసీలలు లేవని, 09 హోటళ్లు & లాడ్జీలకు ట్రేడ్ లైసెన్స్ లేవు, 13 హోటళ్లు & లాడ్జీలకు FSSAI లైసెన్సు లేవు, 10 హోటళ్లు & లాడ్జీలు జీఎస్టీ సర్టిఫికేట్ లేవు, 06 హోటళ్లు & లాడ్జీలలో సందర్శకుల సమాచారాన్ని సరిగ్గా అప్డేట్ చేయడం లేదు.ఈ సందర్భముగా సిపి మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో గల అన్ని హెూటల్/లాడ్జిలలో చట్ట పరముగా ఉన్న అన్ని నిబంధనలను ఖచ్చితముగా పాటించాలని కోరారు, ఇకపై కూడా హెూటల్/లాడ్జిల పై ఈ డైనమిక్ దాడులు కొనసాగుతాయనీ, నిబంధనలను పాటించని హెూటల్/లాడ్జిల యాజమానులపై కూడా చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, యెటువంటి ఫిర్యాదులుకైనా తాను ఇచ్చిన 7995095799 నంబరుకు ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా తెలియపరచగలరని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

ఎస్ ఎస్ పి ఓ చంద్రశేఖర రావు

విశాలాంధ్ర-ఆనందపురం : బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ జోగా చంద్రశేఖర రావు పేర్కొన్నారు. బుధవారం బొడ్డపాలేం , వేములవలస ఎస్సీ కాలనీ ఎంపీపీ పాఠశాలల ను డ్రాప్ అవుట్ చిల్డ్రన్ ఫిజికల్ వెరిఫికేషన్ నిమిత్తం సందర్శించారు. బొద్దుపాలెం లో ఒకరిని, వేములవలస ఎస్సీ కాలనీ నందు ఇద్దరినీ ఫిజికల్ గా గుర్తించారు. కొంతసేపు వారితో ఇంట్రాక్ట్ అయ్యి మాట్లాడుతూ ప్రతిరోజు తప్పకుండా పాఠశాలకి హాజరు కావాలని, బాగా చదువుకోవాలని, రుచికరమైన మధ్యాహ్నం భోజనం చక్కగా తినాలని చెప్పారు .అనంతరం ఉపాధ్యాయులకు అకాడమిక్ పరంగా తగు సూచనలు సలహాలు ఇస్తూ ప్రతి విద్యార్థికి లాంగ్వేజెస్ లో రీడింగ్ అండ్ రైటింగ్ స్కిల్స్ మెరుగుపరచాలని సూచించారు .వేములవలస ఎస్సీ కాలనీలో ఉన్న రెండు అంగన్వాడి సెంటర్లను తనిఖీ చేసి విద్యార్థుల సంఖ్యను పెంచుటకు తగు కృషి చేయాలని అలాగే 5 ప్లస్ పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించుటకు తగు కృషి చేయాలని సూచించారు. అనంతరం పి.ఎం. శ్రీ పాఠశాల ఆనందపురం జ.డ్పి.హెచ్.ఎస్, సందర్శించి ప్లేగ్రౌండ్ తదితర వర్కులను తనిఖీ చేసి వాటిని సకాలంలో పూర్తి చేయాలని ఏ.ఈ .శ్రీనివాస్, పాఠశాల పీడీ ప్రసాద్ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెఆర్కే పట్నాయక్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి-1జోగేంద్రనాథ్ ,సిఆర్పి షిణగం. శివాజీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె ఆర్ కే పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలతో జలగాటమాడుతున్న అధికారులు

విశాలాంధ్ర-పద్మనాభం: పద్మనాభం మండలం రేవిడి పంచాయతీ పరిధిలో రౌతులపాలెం కాలనీలో నిత్యం కొళాయిల ద్వారా కలుషిత నీరు రావడం వల్ల స్థానిక సచివాలయానికి వెళ్లి ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవట్లేదని గత మూడు నెలల నుంచి కలుషిత నీరు వల్ల చాలా ఇబ్బంది పడుతున్నామని మేము త్రాగునీటికి ఎటు పోలేని పరిస్థితిని స్థానికులు తమ గోడును విన్నవించుకున్నారు. కొళాయి పైపులను మురుకు కాలువల గుండా వేయడం వల్ల పైపులు పాడై మురుకి నీరు కూడా కొళాయి నీరుతో పాటు వస్తుందని, మంచినీళ్ల ట్యాంకు అపరిశుభ్రంగా ఉందని అధికారులకు ఎన్నిసార్లు తెలియజేసిన సుచాయిగా వస్తున్నారు వెళ్తున్నారు తప్ప, పూర్తిగా పట్టించుకునే నాథుడే లేరని స్థానికులు తమ గోడును వెలబుచ్చుకున్నారు. తాము చేసేది ఏమీ లేక ఆ కుళాయిల నుంచి వస్తున్న మురికి నీరు వాడుకోలేక నరకయాతన అనుభవిస్తున్నామని తెలియజేశారు. అనారోగ్యం పాలు కూడా అవుతున్నామని తెలియజేశారు. మేము కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని ఆయనే మా సమస్యకు పరిష్కారం చేస్తారని అన్నారు.

వికసిత భారత్ మోడీ సంకల్పం

విశాలాంధ్ర-పెందుర్తి: వికసితి భారతి సాధించడం ప్రధాని నరేంద్ర మోడీ సంకల్పమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పివిఎన్ మాధవ్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం పెందుర్తి నియోజకవర్గం కన్వీనర్ గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో పెందుర్తి తాండ్రపాపారాయ కళ్యాణ మండపంలో బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాధవ్ నరేంద్ర మోడీ 10 సంవత్సరాల పాలనలో వికసిత భారత్ వైపు భారత్ అడుగులు వేస్తున్నదని తెలిపారు. రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్ మాట్లాడుతూ భారతీయ రాజకీయాలలో బిజెపి తీసుకు వచ్చిన మార్పు గురించి వివరించారు. అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వర రావు గటభారతీయ జనతా పార్టీ సంస్థా గత ఎన్నికల విషయాలలో రాజకీయ పురోగమ వృద్ధిని తెలిపారు. అనకాపల్లి జిల్లా జనరల్ సెక్రెటరీ పట్టాభి ప్రసాద్, పరవాడ మండల అధ్యక్షులు పిల్ల సతీష్ కుమార్, మండల అధ్యక్షులు గొంప నర్సింగరావు, 95,97 వార్డుల అధ్యక్షులు చిక్కాల సతీష్, 93,94, 96 వార్డ్స్ అధ్యక్షులు నాగమణి తదితరులు పాల్గొన్నారు

11న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏఈ పి. శ్రీనివాసరావు

శాలాంధ్ర-విశాలాంధ్ర-సాగర్ నగర్: జీవీఎంసీ 8వ వార్డు పరిధిలో ఎండాడకు నబ్‌స్టేషన్ వరిధిలో 11KV/33KV మరమ్మతులు చేవడుతున్నారు. మరియు కండక్టర్ మార్పిడి చెట్టుకొమ్మలు తీస్తున్న కారణంగా 11-4-2025తేదీన విద్యుత్తుకు అంతరాయం కలుగును జూన్ 3 ఏఈ పి. శ్రీనివాసరావు తెలిపినప్రకారం ఎండాడ పెట్రోల్ బంక్.మరియు బ్యాక్ సైడ్ సిరిగుడ్ నగర్, వివేకనందనగర్, దన్నల్ల లేఔట్.తదితర ప్రాంతాల్లో ఉదయం9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగునని తెలియజేశారు.

మార్క్ శంకర్ పవనోవిచ్ త్వరగా కొలుకోవాలి

హనుమాన్ దేవాలయంలో మూర్తి యాదవ్ ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, కార్యకర్తలు, అభిమానులు పూజలు

విశాలాంధ్ర-విశాఖ సిటీ: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ పీతలమూర్తి యాదవ్ ఆధ్వర్యం లోని జనసేన కార్పొరేటర్లు, కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానులు బుధవారం వెంకోజీపాలెం హనుమాన్ దేవాలయంలో 500 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూర్తి యాదవ్ మాట్లాడుతూమా ఆరాధ్యులు, కోట్లాదిమంది అభిమాన నాయకులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారి చిన్న కుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్ సింగపూర్ లో ప్రమాదానికి గురికావడం ఎంతగానో కలిచివేసిందన్నారు. పెద్ద కుమారుడు అకిరా నందన్ జన్మదిన వేడుకలను వదులుకొని గిరిజనులకు ఇచ్చిన మాట ప్రకారం సంకల్ప దీక్షతో గిరిజన ప్రాంతంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తుండగా మంగళవారం ఉదయం ఈ పిడుగు లాంటి వార్తను విని చెలించకుండా ఆ కార్యక్రమాలను పూర్తి చేసుకుని తాను సింగపూర్ కు అయినమయ్యారన్నారు. ఈ ఉదంతం ప్రజలను తన సొంత కుటుంబ సభ్యుల కంటే ఎక్కువగా పవన్ కళ్యాణ్ ప్రేమిస్తున్నారని దానికి రుజువుతోందన్నారు. కార్యక్రమంలో జనసేన పర్యావరణ రాష్ట్ర విభాగ ప్రధాన కార్యదర్శి బోలిశెట్టి సత్య, పంచకర్ల సందీప్, సంకు వెంకటేశ్వరరావు, నాగలక్ష్మి, కార్పొరేటర్లు ఉషశ్రీ, కందుల నాగరాజు, జనసేన నాయకులు పోతు వెంకట ప్రసాద్, కళ, శ్రీనివాస్ పట్నాయక్, శ్రీనివాస్, శేఖర్ అభిమానులు పాల్గొన్నారు.

కాలువ పనులు పరిశీలించిన కార్పొరేటర్ కన్నా..

విశాలాంధ్ర-పెందుర్తి : జీవీఎంసీ 93 వ వార్డు కృష్ణానగర్ లో నాగిశెట్టి మారయ్య ఇంటి నుండి చెక్క దుర్గారావు ఇంటి మీదుగా నాగిశెట్టి అప్పలనాయుడు ఇంటి వరకు గెడ్డపై 19.80 లక్షలతో నిర్మిస్తున్న ఎస్.డబ్ల్యూ.డ్రైన్ పనులను స్థానిక కార్పొరేటర్ రాపర్తి కన్నా బుధవారం ఉదయం పరిశీలించారు. స్థానిక కూటమి నాయకులు ఎర్ర నాగరాజు, నాగిశెట్టి చిన్న శ్రీను, మాజీ ఉపసర్పంచ్ జీ మహేష్ తో కలిసి కాలువ పనులు పరిశీలించిన కార్పొరేటర్ సంబంధిత అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు ప్రజలకు ఇబ్బంది కలగకుండా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని సూచించారు.

13న బిల్డింగ్ మెటీరియల్ ఎగ్జిబిషన్ వైబ్రంట్ బిల్డ్‌కాన్ 2025

విశాలాంధ్ర-విశాఖపట్నం: భారతదేశంలో అతిపెద్ద బిల్డింగ్ మెటీరియల్ ఎక్స్‌పో వైబ్రంట్ బిల్డ్‌కాన్ 2025ను వాణిజ్య, పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్ ఏప్రిల్ 13 న 2025న న్యూఢిల్లీలోని యశోభూమి కన్వెన్షన్ సెంటర్‌లో ప్రారంభించనున్నారని వైబ్రంట్ బిల్డ్‌కాన్ గ్లోబల్ బిజినెస్ హెడ్ విశాల్ ఆచార్యతెలిపారు. ఈ కార్యక్రమం ప్రపంచ నిర్మాణ, మౌలిక సదుపాయాల పరిశ్రమలో ఒక మైలురాయి సమావేశం అవుతుందన్నారు. ఇందులో 27,000 చదరపు మీటర్ల విస్తారమైన ప్రదర్శన ప్రాంతంలో 250 మందికి పైగా ప్రదర్శనకారులు, 50,000 కి పైగా దేశీయ సందర్శకులు, 700 కి పైగా అంతర్జాతీయ కొనుగోలుదారులు పాల్గొంటారన్నారు. ఈ ప్రదర్శన కోసం కర్టెన్ రైజర్ ఇటీవల న్యూఢిల్లీలో జరిగిందనీ, దీనికి కీలకమైన వాటాదారులు పరిశ్రమ నాయకులు హాజరయ్యారన్నారు.

ఏసి విభాగంలో పరిశ్రమ వృద్ధిని అధిగమించిన సామ్‌సంగ్

విశాలాంధ్ర-విశాఖపట్నం: భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన సామ్‌సంగ్, జనవరి మరియు మార్చి, 2025 మధ్య దాని ఎయిర్ కండిషనర్ల అమ్మకాలు 2 రెట్లు పెరిగాయని, ఇది పరిశ్రమ వృద్ధి 20-25 శాతం కంటే ఎక్కువగా ఉందని నేడు తెలిపింది. పరిశ్రమలో అత్యుత్తమంగా ఉన్న వృద్ధి భారతదేశంలో క్యాలెండర్ సంవత్సరం మొదటి త్రైమాసికంలో సామ్‌సంగ్ 10శాతం మార్కెట్ వాటాను పొందడంలో సహాయపడింది. "మా ఏసి వ్యాపారం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. మార్చి త్రైమాసికంలో, మేము రెండు రెట్ల వృద్ధిని సాధించాము, ఇది మా అంతర్గత అంచనాల ప్రకారం మార్కెట్‌లో 10 శాతం ని సాధించడంలో మాకు సహాయపడింది. పరిశ్రమలో వృద్ధికి మేము నాయకత్వం వహించబోతున్నామని, మెరుగైన వృద్ధితో మాకు మంచి మార్కెట్ వాటా కూడా ఉంటుందని మేము విశ్వసిస్తున్నాము" అనిసామ్‌సంగ్ వద్ద డిజిటల్ ఉపకరణాల వ్యాపారం వైస్ ప్రెసిడెంట్ ఘుఫ్రాన్ ఆలం అన్నారు.

మేక్ ఇన్ ఇండియా స్మార్ట్‌ఫోన్‌ల కి ఫ్లిప్‌కార్ట్‌తో భాగస్వామ్యం చేసుకున్న అల్కాటెల్

విశాలాంధ్ర-విశాఖపట్నం: ఫ్రెంచ్ వినియోగదారు టెక్నాలజీ బ్రాండ్ అయిన అల్కాటెల్, భారతదేశంలోని ప్రముఖ ఈ కామర్స్ మార్కెట్‌ప్లేస్‌లలో ఒకటైన ఫ్లిప్‌కార్ట్‌తో తమ వ్యూహాత్మక రిటైల్ భాగస్వామ్యాన్ని ఈరోజు వెల్లడించింది. ఈ భాగస్వామ్యం ద్వారా, అల్కాటెల్ తమ తాజా శ్రేణి స్మార్ట్‌ఫోన్‌లను ఫ్లిప్‌కార్ట్ యొక్క ప్రధాన ప్లాట్‌ఫామ్ మరియు దాని క్విక్ కామర్స్ విభాగం, ఎఫ్ కె మినిట్స్ రెండింటిలోనూ తీసుకురానుంది. భారత మార్కెట్లో సాంకేతికతను విస్తృత స్థాయిలో చేరువ చేయటంతో పాటుగా తమ కార్యకలాపాలను విస్తరింప చేయటంలో అల్కాటెల్ యొక్క నిబద్ధతను ఈ భాగస్వామ్యం నొక్కి చెబుతుందనీ ఆ సంస్థ ప్రతినిధి అతుల్ వివేక్ అన్నారు. బ్రాండ్ యొక్క "మేక్ ఇన్ ఇండియా" స్మార్ట్‌ఫోన్‌లు మెట్రోలు, టైర్ 2 మరియు టైర్ 3 నగరాల్లో డిజిటల్‌గా అవగాహన ఉన్న వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని ప్రీమియం ఆవిష్కరణ, ఆకర్షణీయమైన ఫ్రెంచ్ డిజైన్‌ను మిళితం చేస్తాయన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ లతో ఆర్థికంగా చిదిగిపోతున్న యువత....

మండలంలో సుమారుగా 1000కోట్ల పైనే బెట్టింగ్‌లు

యువతను పట్టిపీడిస్తున్న మాయాజూదం

బలైపోతున్న యువత.. నలిగిపోతున్న కుటుంబాలు..

పోలీస్ అధికారులు హెచ్చరించినా మారని తీరు

విశాలాంధ్ర-అనందపురం: మారుతున్న కాలంతో పాటు యువత రోజురోజుకి ఒక నూతన ఓరవడిని ఎన్నుకుంటున్నారు. తక్కువ కాలంలో ఎక్కువ సంపాదించేందుకు రకరకాల మార్గాలను అన్వేషిస్తూ మాయా జోదంలో చివరికు బలైపోతున్నారు. నేటి యువతలో కొంతమంది ఎలాగైనా అడ్డదారిలో కోటీశ్వరులు అవ్వాలని తపనతో చెడు మార్గాలలో వెలుతూ, వారితోపాటు కొందరిని చెడు వ్యసనాలకు బలి చేస్తున్నారు. ఆర్థికంగా చిదిగిపోయి బెట్టింగ్ యాప్ లలో డబ్బులు పోగొట్టుకోవడం వల్ల అప్పులు చేసి మరి బెట్టింగ్ ఆడడం వలన ఆర్థిక సమస్యలు మరింత వారికి పెరుగుతున్నాయి .కొందరు లోన్ యాప్స్ ద్వారా అప్పులు చేసి వాటిని తీర్చలేక ఇబ్బందులు పడుతున్నారు ఈ బెట్టింగ్ యాప్ లకు బానిస ఆవడం వల్ల మానసిక ఒత్తిడి ఆందోళన పెరిగిపోవటంతో వాటిని భరించలేక కొంతమంది చివరకు ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్న సంఘటనలు మనం చూస్తూనే ఉన్నాం. ప్రస్తుత సమాజంలో ఆధునిక టెక్నాలజీతో అనేక రకాలుగా యువత చెడు వ్యసనాలకు బానిస అవుతున్నారు. చివరికి డబ్బులు కోసం నేరాలకు కూడా పాల్పడుతున్నారు కొందరు బెట్టింగ్ యాప్స్ ను ప్రమోట్ చేస్తూ ఇతరులను ఇబ్బందుల్లోకి నేడుతున్నారు. యువత చెడు మార్గంలో వెళ్లడం వలన సమాజం మీద చెడు ప్రభావం భారీగానే ఉంటుంది. ఆనందపురం మండలంలో ఇప్పటివరకు సుమారుగా 1000 కోట్లకు పైగా ఆన్లైన్ గేమ్స్, బెట్టింగ్ ల లో పోగొట్టుకున్నట్లు ఊహాగానాలు అయితే బలంగా వినిపిస్తున్నాయి. అయితే వీరు నేరుగా బుకీలతో సంప్రదింపులు జరిపి నేరుగా వీరు నగదును ఆన్లైన్లో పోగొట్టుకుంటున్నారు. బుకీలకు పంపించడం ద్వారా ఈజీగా మధ్యవర్తులుగా యువతను నిత్యం మోసం చేస్తూ మసిపూసి మారేడు కాయ చేస్తున్నారు. అనేకమంది యువత చెడు వ్యసనాలకు బానిసై లబోదిబో మన్నప్పటికీ ఏదో రకంగా ఈ బెట్టింగ్ భూతంతో చివరకు తీవ్రంగా అప్పుల పాలు అవుతున్నారు. ఈ ఆన్లైన్ బెట్టింగ్ జూదం ద్వారా ఎక్కువ మొత్తంలో నగదును పోగొట్టుకున్న వారు బయటికి చెప్పుకోలేక తీవ్రమైన మనోవ్యాధనకు గురవుతూ ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటూ, కనపడిన వారి దగ్గర నుండి అప్పులు చేస్తూ చివరకు తీర్చలేక ప్రాణం మీదకు తెచ్చుకుంటున్నారు. పిల్లల మీద నమ్మకంతో ప్రయోజకులు అవుతా రని తల్లిదండ్రుల ఆశలు ఆవిరైపోతున్నాయి. పోలీస్ ఉన్నతాధికారులు సమాజంలో చెడు వ్యసనాలకు యువత బానిస కావద్దని అనేకమార్లు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసినప్పటికీ యువతలో పూర్తిస్థాయిలో మార్పు అయితే రాలేదని చెప్పవచ్చు. ఈ ఐపీఎల్ కాలంలో అయితే బెట్టింగ్ తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుందని తెలుస్తోంది. ఇప్పటికైనా యువత ఈ భూతానికి దూరంగా ఉండి చదువు లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహిం చాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఏదేమైనా సరే సమాజంలో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలంటే శ్రద్ధగా చదువుకొని యువత దేశాభివృద్ధికి కృషిచేయాలని, యువత తలుచుకుంటే సాధించలేనిదంటు ఏమీ లేదని,పలువురు సీనియర్ సిటిజన్స్ అభిప్రాయపడుతున్నారు.

పోలీసులపై వైయస్ జగన్ అనుచిత వ్యాఖ్యలు శోచనీయం

తక్షణమే వైయస్ జగన్ ను అరెస్టు చేయాలి

విశాలాంధ్ర-గాజువాక: పోలీసులను బట్టలు ఊడదీసి కొడతానని మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి వ్యాఖ్యానించడం శోచనీయమని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. అతడిని తక్షణమే అరెస్టు చేసి చట్టప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలోనే బుధవారం ఉదయం ఆయన గాజువాక పోలీస్ స్టేషన్ సిఐ పార్థసారథికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బి.వి.రామ్ మీడియాతో మాట్లాడుతూ.. నిరంతరం చట్టాన్ని పరిరక్షించే పోలీసుల స్థాయిని తగ్గించేలా, ప్రజలలో చులకన భావం కలిగించే విధంగా వ్యాఖ్యలు చేయడం ఎంత మాత్రం క్షమించే విషయం కాదన్నారు. సత్యసాయి జిల్లా రాప్తాడులో మంగళవారం.. వైయస్ జగన్ పర్యటించిన నేపథ్యంలో పోలీసులను బట్టలూడదీసి కొడతానంటూ ఈ వ్యాఖ్యలు చేశారన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా వైయస్ జగన్ పనిచేసినప్పుడు ఒకవైపు అరాచక పాలన కొనసాగిస్తూనే.. పోలీసులపై విపరీతమైన ఒత్తిడి తీసుకువచ్చే వారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వ పాలనలో పోలీసులు చట్ట ప్రకారం విధులను నిర్వహిస్తుంటే వైయస్ జగన్ తట్టుకోలేకపోతున్నారన్నారు. పోలీసులకు కూడా మనోభావాలు ఉంటాయని, కుటుంబాలు ఉంటాయనే విషయాన్ని వైయస్ జగన్ మరిచి పోయి ఇష్టానుసారంగా మాట్లాడడం ఎంత మాత్రం తగదన్నారు. ఒకవేళ పోలీసులు తమ విధులను బహిష్కరిస్తే.. శాంతిభద్రతల పరిస్థితి ఎలా ఉంటుందో వైయస్ జగన్ సమాధానం చెప్పాలన్నారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన వైఎస్ జగన్ ఇటువంటి వ్యాఖ్యలు చేయడం పట్ల పోలీసులు తమ ఆవేదనను చెప్పుకోలేక పోయినా.. వారు ఎంత మదన పడుతున్నారో ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే వైయస్ జగన్మోహన్ రెడ్డి పై తక్షణమే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని తెలుగు శక్తి డిమాండ్ చేస్తోందన్నారు. అనంతరం గాజువాక సిఐ పార్థసారథి సాలువతో సత్కరించి పోలీసులపై తనకున్న గౌరవం తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ చాటుకున్నారు. కంప్లైంట్ ఇచ్చిన వారిలో వల్లమూడి పూర్ణచంద్రరావు, బొల్లినేని వెంకటేశ్వరరావు, ఈ.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన భీమిలి ఏ ఏం సి చైర్మన్ ను సత్కరించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాలాంధ్ర-పద్మనాభం: నూతనం గా ఎన్నికైన భీమిలి ఏఎంసీ చైర్మన్ కురిమిన రామస్వామి నాయుడు ను స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సత్కరించారు. భీమిలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి డా.సందీప్ పంచకర్ల, ఆధ్వర్యంలో నియోజిక వర్గ బూత్ కన్వీనర్ శాకరి శ్రీనువాసు, జిల్లా ప్రోగ్రాం కమిటి మెంబర్ వి. బి. నాయుడు,మండల ప్రధాన కార్యదర్శి ముద్దాడ సూరప్పుడు,మండల సెక్రటరీ చింతపల్లి, సోమేష్,ఉప అవ్యక్షలు జె.సంతోష్ మరియు మండల కమింటి నాయకులు జననాన పార్టీ భీమిలి మండల అధ్యక్షలు,ఆనందపురం మండల అధ్యక్షులు మండల కమిటి,మరియు వార్డు అధ్యక్షులు,జిల్లా కమిటి మెంబర్స్. జనసేన నాయుకులు అందరూ కలిసి కురిమిన రామస్వామి నాయుడుకు ఏ ఎమ్ సి చైర్మన్ పదవి వచ్చిన సందర్భంగా స్థానిక శాసన సభ్యుల గంటా శ్రీనువాసరావు ఆశీస్సులు కొరకు ఆయన నివాసంలో కవలవడం జరిగింది.ఆయన రామస్వామి నాయుడును అభినందించి కూటమి నాయకులతో కలిసి రైతులకు అందుబాటులో ఉండాలని మంచి పరిపాలన అందించాలని నా ఆశీస్సులు మీకు ఎప్పుడు ఉంటాయని తెలియజేశారు. రామస్వామి నాయుడు ను శాలువతో కప్పి సత్కరించి అభినంచారు. ఈ కార్యక్రమంలో కూటమ నాయకులు పాల్గొన్నారు.

గీతంలో ఎఐసిటిఇ స్కాలర్‌షిప్‌లు, ఇతర పధకాలపై అవగాహన



విశాలాంధ్ర-మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికంగా విశాఖలోని వివిధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులకు అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఎ.ఐ.సి.టి.ఇ) అందిస్తున్న సరస్వతి స్కాలర్‌షిప్‌లు మరియు ఇతర పథకాల పై అవగాహన వర్క్‌షాప్‌ను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు విద్యాఅవకాశాలు మరియు ఆర్థిక సహయం అందించడానికి స్కాలర్‌షిప్‌లతో ప్రోత్సహించడానికి ఏర్పాటు చేయబడింది. ఈ వర్క్‌షాప్ లక్ష్యం విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు విద్యాసంస్థలకు అఖిలభారత సాంకేతిక విద్యామండలి (ఎఐసిటిఇ)కి అందరి అందుబాటులో ఉన్న వివిధ ఫండింగ్ అవకాశాల గురించి అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమంలో ఎఐసిటిఇ సభ్య కార్యదర్శికదు డాక్టర్ రాజీవ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని వివిధ ఫండింగ్ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన పెంచాల్సిన అవసరాన్ని ఎత్తిచూపారు. సరస్వతి స్కాలర్‌షిప్ వంటి పథకాలు ప్రత్యేకంగా దేశంలోని ద్వితీయ, తృతీయశ్రేణి నగరాలలో గల కళాశాల విద్యార్థులను మరియు ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన అమ్మాయిలకు లాభపడేలా చేయాలని దీని వల్ల బలమైన మరియు చురుకైన విద్యావాతావరణాన్ని సృష్టించగలమని ఆయన అన్నారు. ఈ వర్క్‌షాప్‌లో వివిధ ప్రాంతంలోని విద్యార్థులు, అకడమిక్ నాయకులు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు. పాల్గొన్నవారికి సరస్వతి స్కాలర్‌షిప్ స్కిమ్ గురించి లోతైన సమాచారం అందించబడింది. ఎఐసిటిఇ సలహదారు డాక్టర్ ఎన్.హెచ్. సిద్దలింగస్వామి మాట్లాడుతూ ఈ స్కిమ్ ఆర్థికంగా బలహీన వర్గాల నుండి వచ్చే ప్రతిభావంతులైన అమ్మాయిలకు బిబిఎ,బిసిఎ,బిఎమ్ఎస్ ప్రోగ్రామ్‌లను ఎఐసిటిఇ ఆమోదించిన సంస్థల్లో అభ్యసించడానికి సహాయం అందించడానికి ఉద్దేశించబడింది. అదనంగా ఈ వర్క్‌షాప్‌లో ఎఐసిటిఇ డాక్టోరల్ ఫెలోషిప్ (ఎడిఎఫ్), ఎఐసిటిఇ ఫండింగ్ స్కీమ్స్ కింద నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాల అభివృద్ధి ,ఫ్యాకల్టీ అభివృద్ధి మరియు సాంకేతిక విద్యా రంగంలో పరిశోధనను ప్రోత్సహించడానికి ఉద్దేశించిన అనేక ఇతర పథకాలను కూడా పరిచయం చేశారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్న వారికి వివిధ ఎఐసిటిఇ గ్రాంట్‌లు మరియు స్కాలర్‌షిప్‌లు కోసం ధరఖాస్తు చేసే ప్రక్రియపై మార్గనిర్దేశనం ఇవ్వబడింది. అలాగే విద్యార్థులు, ఉపాధ్యాయలు ప్రశ్నలు అడిగి, స్కీమ్స్ గురించి స్పష్టత పొందడానికి ఇంటరాక్టివ్ సెషన్లు కూడా నిర్వహించబడ్డాయి. గీతం వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎరోల్ డిసౌజా అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఆయన విద్యార్థులను ఎఐసిటిఇ అందించిన అవకాశాలను పూర్తిగా ఉపయోగించు కోవాలని సూచించారు. కార్యక్రమంలో గీతం ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం ఐక్యూఎసి డైరక్టర్ ప్రొఫెసర్ రాజా ప్రభు ఆర్, ఎఐసిటిఇ ఉన్నత అధికారులు , వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విశాఖ మహిళా కళాశాల అభివృద్ధికి హెచ్‌పిసిఎల్ రూ.50 లక్షల విరాళం

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం మహిళా కళాశాల అభివృద్ధి నిమిత్తం కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద హెచ్.పి.సి.ఎల్. రూ.50 లక్షల విరాళం అందించింది. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఆ సంస్థ సీజీఎం జి. కిరణ్ కుమార్, విశాఖ రిఫైనరీ ఈడి ఆర్. రామకృష్ణన్ , సీపిజెడ్వో శ్రీ శ్రీనివాసరావు జిల్లా కలెక్టర్ ఎం. ఎన్. హరేంధిర ప్రసాద్ ను తన ఛాంబర్లో కలిసి చెక్కును అందజేశారు. విశాఖపట్నం మహిళా కళాశాలలో టాయిలెట్ బ్లాక్ ఆధునికీకరణ, ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఉపయోగించాలని కళాశాల అధికారులకు కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో మహిళా కళాశాల ప్రిన్సిపల్ మంజుల, సీపీఓ శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.